Acc. No. 3278

# ఆంధ్ర సంస్థానములు : సాహిత్యపోషణము

(సాహిత్య అకాడమీ బహుమతినందిన రచనము)

డా. తూమాటి దోణప్ప, ఎం.ఎ., పిఎచ్.డి.

# పానుగల్లు

## ప్రవేశిక

ఈ ఎస్టేటు నెల్లూరు, ఉత్తరార్కాడు మండలములలోని కొన్ని గ్రామములతో కూడినది. కాళహస్తి పట్టణమునకు సమీపమున స్వర్ణముఖీనదీతీరమున నిటీవల నిర్మింపఁబడిన పానుగల్లు అను పట్టణము ఈ ఎస్టేటుదారుల నివాసము. ఋణబాధలపాలయిన కాళహస్తి సంస్థానము నందలి పామూరు తాలూకాను పానుగల్లు పాలకులు విక్రయించికొని తమ ఎస్టేటును పెంపొందించిరి. ఇది నవీనమయిన ప్రొప్రయిటరీ యెస్టేటు.

## సంస్థాన చరిత్రము

ఈ పానుగల్లువారు వెలమలు*. వీరిది పట్నూళ్ళ గోత్రము. కాలచోదితమున కాకతేశ్వరుఁగొలిచినవారు. వీరి పూర్వులు కాకతీయ సామ్రాజ్యమంతరించువాఁక తెలంగాణమునందలి నల్లగొండకు 3 మైళ్ళ దూరమునఁగల పానుగల్లు కోటకు అధిపతులుగా నుండిరఁట. బాలనాగమ్మ, మాయలమరాఠీల జానపదగాథలకీ పానుగల్లు ముఖ్యరంగము. పదునెనిమిదవ శతాబ్దాంతము నాఁటికి ఈ కుటుంబము అనేకవిపత్పరంపరలకు లోనయి తమ పాలనమునందలి పెక్కు ప్రాంతములను పోఁగొట్టుకొనినది. ఆ పిమ్మట నీ వంశీయులు దక్షిణ సీమలకు తరలివచ్చిరి. వీరిలో ప్రఖ్యాతులయిన వేంకటరామారాయణింగారు నెల్లూరు ఉత్తరార్కాడుమండలములలో మంచి విలువయినభూములను సంపాదించిరి. వీరి కుమారులగు వేంకటరంగారాయణింగారి కాలమున పానుగల్లు ప్రభుకుటుంబము కాళహస్తిలో స్థిరపడినది. వేంకటరంగారాయణింగారి సర్వతోముఖప్రతిభవలన ఎస్టేటు చాలవరకు వర్ధిల్లుచువచ్చినది. ఈయన పెద్ద కుమారులు శేషాచలపతిరాయణింగారు కాళహస్తి పట్టణమునకు దాపున స్వర్ణముఖి గట్టునందొక గ్రామము నిర్మించి దానికి 'పానుగల్లు' అని తమపూర్వులరాజధాని పేరు పెట్టిరి.

వేంకటరంగారాయణింగారి పెద్దకుమారులు రామారాయణింగారు (1866—1928) ఈ వంశమునందు గొప్ప పేరుప్రతిష్ఠలు గలవారు. రాజకీయరంగము

*'తొలికాల మూర్విగొడవల వెలిమై పొలములయందు విహరించుటచే
నిల కాఁపుజనులుకొందఱు వెలమలనం జగతిలోన విశ్రుతులగుటన్'
—పద్మనాయక చరిత్రము, ప. 26.

నందును, సాంఘికసేవాకార్యక్రమములందును, విద్యారంగమునందును పరిగణింపఁదగిన కృషి సల్పినవారు. 1912 లో ఇంపీరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో మదరాసురాష్ట్రము జమీందారుల, భూస్వాముల ప్రతినిధిగా సభ్యులు. 1915 లో విశాఖపట్టణములో జరిగిన మూఁడవనాంధ్రమహాసభకును, 1915 లో రాజమంద్రిలో జరిగిన రెండవ ఆంధ్రదేశగ్రంథాలయముల మహాసభకును పానుగంటి రామారాయణింగారధ్యక్షులు. 1918లో దివాన్‌బహద్దరు బిరుదమును, 1922 లో రాజా బిరుదమును, ఆపిమ్మట 1926 లో సర్ బిరుదమును బొందిరి. జస్టిస్‌పక్షము తరపున మద్రాసురాష్ట్రమునకు విద్యాశాఖామంత్రిగాను, ముఖ్యమంత్రిగాను వ్యవహరించి గొప్పపేరు గడించిరి. వీరి సోదరులు శ్రీ రాజా పానుగంటి పార్థసారథిరాయణింగారు.

## సాహిత్యపోషణము

దక్కనులోని పానుగల్లుకోటకు అధిపతులుగనుండిన కాలమునందలి యీ వంశీయుల సాహితీపోషణ వివరములు లభ్యముకాలేదు. పానుగంటి రామారాయణింగారు చిన్నతనమునుండియు సంస్కృతాంధ్రములలో మంచి యభిరుచిగలిగి ప్రెసిడెన్సీ కాలేజీలో ప్రత్యేకాంశములతోపాటు తెలుఁగు అభిమానవిషయముగా స్వీకరించి యం.ఏ. పరీక్షకు చదివి 1896 లో ప్రథమ శ్రేణిలో పట్టభద్రులయిరి. చాలకాలము మద్రాసువిశ్వవిద్యాలయములో తెలుఁగునకు పరీక్షకులుగా నుండిరి. ఉత్తమ కావ్యరచనను ప్రోత్సహింప పిఠాపురము రాజాగా రేర్పఱిచిన సాలుసరి పోటీలలో రామారాయణింగారు కందుకూరి వీరేశలింగము, చిలకమర్తి లక్ష్మీనరసింహముగారలతోపాటు కావ్యపరీక్షకులుగా నుండిరి.* రాజమండ్రిలో జరిగిన ఆంధ్ర సాహిత్య పరిషత్తు ద్వితీయ వార్షికోత్సవ సభ కధ్యక్షతవహించిరి. లార్డ్ హార్డింజ్ ప్రభువు మదరాసునగరము విచ్చేసిన సందర్భమును పురస్కరించికొని తెలుఁగులో శాస్త్రగ్రంథముల ప్రచురణమునిమిత్తము మద్రాసు విశ్వవిద్యాలయమునకు పదివేల రూపాయల ఎండోమెంటు నిధిని సమర్పించిరి. ప్రాయోగిక మనస్తత్త్వశాస్త్ర విభాగమున పరిశోధనమునలుపుటకును, అందొక రీడరుపదవిని నెలకొల్పుటకును 1927 నుండి యేఁటేఁట అయిదువేల రూపాయల విరాళము ఆంధ్ర విశ్వవిద్యాలయమునకొసఁగుటకు రాజాగారు నిర్ణయించిరి. 1928 లో వీరు మరణించుటవలననో లేక మఱేకారణమువలననో వీరి ప్రయత్నము పారముముట్టినట్లు లేదు. ఆంధ్ర విశ్వవిద్యాలయము రూపెత్తుటలో పానుగల్లురాజాగారుచేసిన ప్రత్యేక కృషి మఱవరానిది. మద్రాసురాష్ట్రము విద్యాశాఖామంత్రిగా తెలుఁగుభాషకును, తెలుఁగుభాషాధ్యాపకులకును వీరుచేసిన మేలు విస్మరింపరానిది. కాళహస్తి,

* చిలకమర్తి లక్ష్మీనరసింహము, స్వీయచరిత్రము, పు. 276.

చల్లపల్లి, తుని, నూజివీడు. పిఠాపురము, పెద్దాపురము, బొబ్బిలి. ముక్త్యాల. విజయనగరము పాలకుల వలె వీరి ఆయుర్వేదాభిమానము ప్రత్యేక ప్రశంసకు పాత్రమయినది. వీరి దీక్షాదక్షతల మూలమున 1925 లో మదరాసు ప్రభుత్వము వారు దేశీయవైద్యవిధానమును గుర్తించి, తత్సంబంధి విద్యాలయములను నెలకొల్పిరి.

రాజా పానుగంటి పార్థసారథిరాయణింగారు ఆంగ్లవిద్యాపట్టభద్రులయినను సంస్కృతాంధ్రములయందు మంచి యభినివేశముగలవారు. భగవద్గీతామంజరి, కమలాకల్యాణము, సత్యాకృష్ణసమాగమము మొదలగునవి పార్థసారథి రాయణింగారి ముఖ్యరచనలు. వీరు అచ్చమాంబా వేంకటరంగయార్యులపుత్రులు. వీరి భగవద్గీతామంజరి భగవద్గీతకు నాంధ్రానువాదము. ఇది మంజరీద్విపదలో వ్రాయఁబడినది. మాదిరికి కొన్ని యనువాదభాగములు—

'భూతంబు లన్నసంభూతంబులగునుఁ
బ్రభవించు నన్నంబు వర్షంబువలన
వర్షంబు యజ్ఞంబువలనను బుట్టు
యజ్ఞంబు కర్మమం దావిర్భవించు'

—కర్మయోగము, అధ్యా. 3, ప. 14.

ఈ పంక్తులు క్రింది శ్లోకమునకు తెనిఁగింపు :

'అన్నాద్భవంతి భూతాని
పర్జన్యా దన్నసంభవః,
యజ్ఞాద్భవతి పర్జన్యో
యజ్ఞః కర్మసముద్భవః'

—భగవద్గీతా. తృతీయ. 14.

'విద్యావినయునందు విప్రునందైనఁ
గుంజరమందైన గోవునందైన
శ్వానమందైన శ్వపాకునందయిన
సమదర్శనంబుతో జ్ఞానులుండెదరు'

—కర్మసన్న్యాసయోగము, అధ్యా. 5, ప. 18.

ఈ పైపంక్తులు క్రింది శ్లోకమున కనువాదము :

'విద్యావినయసంపన్నే
బ్రాహ్మణే గవి హస్తిని,
శుని చైవ శ్వపాకే చ
పండితా స్సమదర్శినః'                —పైది, పంచ. 18.

'ఏఱుల పలునీరు లెట్టుల వేగ
సంద్రంబునే చేరఁజనియెడునట్లు

వీరలు నరలోకవీరులు మీదు
వ్రేగుమోములను బ్రవేశించువారు'
—విశ్వరూపసందర్శనయోగము. అధ్యా. 11. ప. 28.

మీఁది పంక్తులు క్రింది శ్లోకమునకు భాషాంతరీకరణము :

'యథా నదీనాం బహవోఽంబువేగా
స్సముద్ర మేవాభిముఖా ద్రవంతి,
తథా తవామీ నరలోకవీరా
విశంతి వక్త్రాణ్యభివిజ్వలంతి' —పైది. ఏకాదశ. 28.

పార్థసారథిరాయణింగారి మఱియొకరచన కమలాకల్యాణము. ఇది యాంగ్లమునందు షేక్స్పియర్ మహాకవి సంతరించిన 'ట్వెల్ఫ్త్‌నైట్' నాటకమునకు స్వేచ్ఛానువాదము. మూలకర్త యభిప్రాయము చెడకుండ తెలుఁగు నుడికారమునకును, తెలుఁగు వాతావరణమునకును దూరముగాకుండ ననువాదము సాఁగినది. ఇది ప్రతిపదభాషాంతరీకరణముకాదు. ఇది రాజాగారి చిన్ననాఁటి రచన. బాల్యోత్సాహము ప్రాబల్యమువలన నానావిధవృత్తముల నిందుఁబొందు పఱిచిరి. బాల్యమువలన పాదపూరణపదములుకొన్ని ప్రవేశించినవని రచయితలే స్వయముగా నంగీకరించిరి. 1892లో పట్టపరీక్షకుఁజదువుచు సంధానించిన కృతియిది. నాటకమునందలి పాత్రముల సంభాషణము చాలతావుల పద్యముల లోనే సాఁగినది. ఇది యయిదంకముల రూపకము.

సత్యాకృష్ణసమాగమమను వీరి రచన చిన్నారి పొన్నారి చిఱుత కూఁకటి నాఁటిది. దీని రచనాకాలము 1888. ప్రథమపరీక్షకు పఠనీయగ్రంథమయిన గోల్డుస్మిత్ 'వికార్ ఆఫ్ ది వేక్‌ఫీల్డ్' కృతియందలి 'ది హర్మిట్' అను ఏకాంశమును స్వీకరించి 'సత్యాకృష్ణసమాగమము' అనుపేర నూటనలువది యాఱు పంక్తుల ద్విపదకావ్యముగాఁ గూర్చిరి. అలఁతియలఁతిపలుకులతో రూపొందిన లఘుకృతి యిది.

## ఉపజీవ్య గ్రంథసూచి

1. తెలుగువిజ్ఞానసర్వస్వము, సంపుటము 3.
2. మాగంటి బాపినీడు, ఆంధ్రసర్వస్వము.
3. ఆంధ్రపత్రిక, సంవత్సరాది సంచికలు.
4. గ్రంథాలయ సర్వస్వసంచికలు.
5. V.L. Sastri, Encyclopaedia of the Madras Presidency and the Adjacent States, pp. 439–442.
6. Andhra University Annual Register, 1937–38.